క్లుప్తంగా

పేరంటాలమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసం అమావాస్యను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన ప్రాంగణంలో హోమ గుండాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ హోమాది కార్యక్రమానికి హాజరయ్యారు. అర్చకుల మంత్రోచ్చరణతో హోమాది కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి, పంటలు సంవృద్ధిగా పండాలన్న ఉద్దేశంతో ఈ హోమం నిర్వహించినట్లు తెలిపారు.

చౌడేశ్వరీదేవికి ఆషాఢ సారె



ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేంచేసిన చౌడేశ్వరీదేవికి భక్తులు ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పాలడుగు బాలాజీ, మాధవి ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి సారె సమర్పించారు.

పెనమలూరు సీఐగా వెంకటరమణ

పెనమలూరు: పెనమలూరు సీఐగా జామి వెంకటరమణను నియమించారు. ఆయన ఏలూరు రేంజ్ వీఆర్ నుంచి పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో వెంకటరమణ పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేశారు. పెనమలూరు సీఐగా ఉన్న టీవీవీ రామారావును గత రెండు రోజుల క్రితం ఉయ్యూరుకు బదిలీ చేశారు. పెనమలూరు సీఐ పోస్టింగ్‌కు గట్టి పోటీ ఉండగా ఎట్టకేలకు వెంకటరమణకు పోస్టింగ్ ఇచ్చారు.

ఇద్దరు ఎస్‌ఐలు బదిలీ

కాగా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా పని చేస్తున్న వి.ఏసేబు, వి.శేషుకుమార్‌లను బదిలీ చేసి వీఆర్‌లో ఉంచారు. ఉయ్యూరు రూరల్ ఎస్‌ఐగా ఉన్న కె.ఉషారాణికి పెనమలూరు ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు.


ఆత్కూరు ఎస్‌ఐ బదిలీ

ఉంగుటూరు: ఆత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎ.పైడిబాబును కృత్తివెన్ను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా ఆత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా వచ్చిన ఎ.పైడిబాబు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించారు.

మహిళల జీవనోపాధికి రుణాలు

విజయవాడ రూరల్: మహిళలు జీవనోపాధిని మెరుగుపర్చుకునేందుకు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజర్ గంధం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంటు జనరేషన్ ప్రోగ్రాం, ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ ముద్ర పథకంలో ప్రతి మహిళ బ్యాంక్ ద్వారా రుణం పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి మహిళ లక్ష నుంచి పది లక్షల రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉంటుందని అందులో 35 శాతం సబ్సిడీ సదుపాయం కూడా ఉందని పేర్కొన్నారు. మిగిలిన రుణానికి బ్యాంక్ నిబంధనల ప్రకారం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాదికి గాను విజయవాడ రూరల్ మండలంలో 353 యూనిట్లు స్థాపించడానికి ప్రభుత్వం టార్గెట్‌గా నిర్ణయించిందని, ఇతర వివరాల కోసం డీఆర్‌డీఏ, ఏపీఎం -9154054118 ఫోను నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేలు విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానానికి ఆదివారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ ముప్పా ఇంద్రకీల గిరీష్ రూ. 50 వేలు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తాము మందిరంలో తలపెట్టిన ప్రతి కార్యక్రమానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. షిర్డీలో మాదిరిగా ఇక్కడ అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాత డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ.. మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంలో తాను కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో విరాళం అందజేశామన్నారు. అనంతరం దాతను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

పేద విద్యార్థుల చదువులు నిర్వీర్యం

- వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత
- పూర్తి స్థాయిలో అందని విద్యాకానుక
- వేతనాలు అందవు, బిల్లులు విడుదల కావు
- అస్తవ్యస్తంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ



నున్న జెడ్పీ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో దట్టంగా పెరిగిన గడ్డి

గన్నవరం: నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి. ముఖ్యంగా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో కీలక సబ్జెక్టులకు సంబంధించి సిలబస్ ముందుకుసాగడం లేదు. విద్యాకానుక కిట్ల పంపిణీలో కూడా ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కిట్లు రాకపోవడంతో పక్క మండలాల నుంచి తీసుకువచ్చి సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో కూడా పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత..

- ఉంగుటూరు మండలంలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. ఎంపీపీ, యూపీ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 96 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఉండగా, 87 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలల్లోనూ ఏడుగురు ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ 19 మందికిగాను 15 మంది ఉన్నారు.
- బాపులపాడు మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో 4,289 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు కోసం చేసిన బదిలీలను కూటమి ప్రభుత్వం రాగానే నిలిపివేసింది. ఫలితంగా మండలంలోని ఎనిమిది పాఠశాలల్లో 11 మంది సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది.
- గన్నవరం మండలంలోని యూపీ, జెడ్పీ హైస్కూల్స్‌లో ఏడుగురు ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కూడా సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉంది.
- మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించడంతో విజయవాడరూరల్ మండలంలో కేవలం 85 శాతం మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేస్తున్నారు. స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కూడా విద్యార్థులందరికి పూర్తి స్థాయిలో అందలేదని తెలుస్తోంది.

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 114 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13,600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న 24 జెడ్పీ పాఠశాలలో మరో 500 మందికి పైగా విద్యార్థులు కొత్తగా చేరారు.

విడతల వారీగా విద్యా కానుక..

విద్యార్థులకు అవసరమైన విద్యా కానుక కిట్లు గతంలో పాఠశాల తెరిచేనాటికి సిద్ధంగా ఉంచేవారు. కానీ ఈ ఏడాది విడతల వారీగా పాఠశాలలకు అక్కడి నుంచి విద్యార్థులకు అందాయి. కొత్తగా చేరిన విద్యార్థుల్లో ఇంకా 60 శాతం మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు మంజూరు కావాల్సి ఉంది. పెరిగిన విద్యార్థుల నమోదు బట్టి ఉపాధ్యాయులు



కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

నివేదిక సమర్పించి రెండో నెల కూడా గడుస్తోంది. కానీ ఇంత వరకూ విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరలేదు. దీంతో ప్రధానంగా బ్యాగులు, నోటు పుస్తకాలు, స్వల్పంగా పాఠ్యపుస్తకాల కొరత ఏర్పడి విద్యార్థుల చదువులు ముందుకుసాగక అవస్థ పడుతున్నారు. కార్పొరేట్‌కు ధీటుగా విద్యార్థులు హుందాగా కనిపించేలా గత వైఎస్సార్ సీపీ సర్కారు తహతహలాడితే కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా గోసాల పాఠశాలలో భోజనం నాణ్యత సమస్య తలెత్తగా అధికారులు ఫిర్యాదుపై దృష్టిసారించారు.

జీతాలు.. బిల్లులు ఏవీ..?

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించే లక్ష్యంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. గత వైఎస్సార్ సీపీ సర్కారు రోజుకో మెనూ అమలు చేసి విద్యార్థులు అందరూ ఆరోగ్యంగా ఎదిగేలా, ప్రతి ఒక్కరూ భోజనం చేసేలా మెనూ అమలు చేసింది. అంతేకాకుండా వంట ఏజెన్సీ కార్మికులకు భోజన నాణ్యత, ఆహార పదార్థాల నాణ్యతపై పోటీలు నిర్వహించి అభినందించింది. ఈ ఏడాది మే నెలలో జిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహించగా జిల్లాలో ప్రథమ స్థానాన్ని కంకిపాడు కైవసం చేసుకుంది. అనేక ప్రోత్సాహక బహుమతులు నియోజకవర్గంలోని పలువురు వంట ఏజెన్సీ కార్మికులకు దక్కాయి. కానీ ప్రస్తుతం అంతా తారుమారు అయ్యింది. ఒక్కో పాఠశాలలో ఇద్దరు, ముగ్గురు వంట ఏజెన్సీ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ. 3 వేలు గౌరవ వేతనం, వంట ఏజెన్సీ నిర్వహణకు సంబంధించిన బిల్లులు దక్కాలి. కానీ రెండు నెలలుగా జీతాలు, ఏజెన్సీ నిర్వహణ బిల్లులు విడుదల కాలేదు. దీంతో ఏజెన్సీ కార్మికులు బయట అప్పులు తెచ్చి ఏజెన్సీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు విడుదల కావడం లేదు



ప్రస్తుతం వంట ఏజెన్సీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా ఏజెన్సీ కార్మికులకు వేతనాలు అందడం లేదు. వంట ఏజెన్సీ నిర్వహణకు సంబంధించి బిల్లులు విడుదల కావడం లేదు. కూటమి ప్రభుత్వం ఏజెన్సీల నిర్వహణపై దృష్టి సారించాలి. కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా బిల్లులు, వేతనాలు ప్రతి నెలా విడుదలయ్యేలా చూడాలి.

– తాడంకి నరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి, కంకిపాడు

విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయొద్దు



విద్యార్థుల బంగారు భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తే భావితరాల ఉజ్వల భవిత ప్రశ్నార్థకంగా మారుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యాకానుక కిట్లు పెండింగ్ లేకుండా ఇచ్చారు. కొత్తగా చేరిన విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందాల్సి ఉంది. అవన్నీ వెంటనే విడుదల చేయాలి. విద్యార్థుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పరిరక్షించాలి. జగనన్న విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థులకు అండగా నిలిచారు.

– దేవభక్తుని చక్రవర్తి, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్

ప్రభుత్వ పర్యవేక్షణ లేదు

నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆటస్థలం గత కొంత కాలంగా వర్షం నీరు నిల్వ ఉండటంతో గడ్డి దట్టంగా పెరిగి పిల్లలు ఆడుకునేందుకు వీల్లేకుండా ఉంది. గ్రౌండ్‌ను అభివృద్ధి చేసి పిల్లలకు అందుబాటులో తీసుకురావాలి. స్కూల్స్‌పై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది.

– గద్దం కుమార్, నున్న గ్రామం



ఉచిత వైద్య శిబిరాలు



కేసరపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



పోరంకిలో మందులు పంపిణీ చేస్తున్న లయన్ ప్రభాకరరావు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి బీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ వేణు నాదెళ్ల, డాక్టర్ శైలజ కేతినేని నేతృత్వంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్లూరి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఎక్కువ మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. అవగాహన లోపం, ఆర్థిక లేమి కారణంగా సరైన వైద్యం పొందలేకపోతున్నారని తెలిపారు. ఇటువంటి వారికి ఉచిత కంటి వైద్య సేవలందించేందుకు ముందుకువచ్చిన అమరావతి ఆస్పత్రి వైద్యులను అభినందించారు. కంటి ఆపరేషన్ అవసరమైన రోగులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయనున్నట్లు డాక్టర్ శైలజ తెలిపారు. గ్రామస్తులు కొడాలి వరప్రసాద్, రాజేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో..

పెనమలూరు: అనుమోలు ఆదరణ ట్రస్టు, లయన్స్ క్లబ్ వీఆర్‌కే వాణిజ్య, క్యాపిటల్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం పోరంకిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, డీవీ సుబ్బారావు, కంచర్ల రాధ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 150 మందికి పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): యనమలకుదురు లాకులు సమీపంలోని ఇందిరానగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. సూర్యారావుపేటలోని అనీల హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ ఎస్. రాకేష్ శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సీజన్‌లో దోమకాటుతో వచ్చే డెంగీ, మలేరియాలతో పాటు టైఫాయిడ్ వంటి జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరం వస్తే సకాలంలో నిర్ధారణ పరీక్షలు చేయించుకుని నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. షుగర్, బీపీ, మూడు నెలల షుగర్ స్థాయిలు(హెచ్‌బీఏ1సీ) వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. థైరాయిడ్ పరీక్షలు సైతం రూ.100లకే నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ఉంగుటూరు: ప్రజా ఆరోగ్య రక్షణలో దాతల సహకారం అభినందనీయమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఉంగుటూరులోని జయరామ విజ్ఞాన విహార పాఠశాల ప్రాంగణంలో ఈడ్పుగంటి వెంకటేశ్వరరావు, అట్లూరి వెంకటకృష్ణ రాంబ్రహ్మం జ్ఞాపకార్థం ఈడ్పుగంటి కృష్ణమూర్తి సౌజన్యంతో ఉయ్యూరు సమత శంకర నేత్రాలయం ఆధ్వర్యాన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ, మాజీ ఎమ్మెల్యే దాసరి మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. ఈ శిబిరంలో డాక్టర్లు నాదెళ్ల స్వాతి, యువాన్, ఆప్తమాలజిస్ట్ నాగపావని 168మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ కాటూరి వరప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి హనోకు, సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ, మాజీ ఎమ్మెల్యే దాసరి

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగేశ్వరరావు బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. అతని వద్ద ఆరు మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం తరలించామని ఎస్‌ఐ సందీప్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్‌ఐ డి.సందీప్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

కంకిపాడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ డి.సందీప్ స్పష్టం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 15 మందిని ఆదివారం అరెస్టు చేశారు. మందుబాబులకు ఎస్‌ఐ సందీప్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మద్యం సేవిస్తూ సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో 1968-69 బ్యాచ్ విద్యార్థులు



ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో.. 1991-92 బ్యాచ్ విద్యార్థులు

ఉయ్యూరు: ఉయ్యూరు జెడ్పీ పాఠశాల 1991-92 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అందరూ అపూర్వ కలయికతో ఆత్మీయతను పంచుకున్నారు. చదివిన తరగతి గదుల్లో కలియ తిరుగుతూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కేక్‌కట్ చేసి వేడుక జరుపుకొన్నారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు సలీం, శివరామకృష్ణ, అనీస్, వేణుగోపాల్, రామకృష్ణ, అంకినీడు ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

కంకిపాడు: ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో 1968-69 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. 56 సంవత్సరాల తర్వాత కలుసుకొని పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి తాము చదివిన తరగతి గదుల్లో కూర్చుని అల్లరి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు. ఒకరినొకరు ఆటపట్టించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఆత్మీయ సమావేశంతో ఈడుపుగల్లు పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

ఉయ్యూరు: స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో ఆదివారం వివిధ రంగాల్లో రాణిస్తున్న యువతతో వైవీబీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యువత నడవడిక, నైపుణ్యత, ఉపాధి అవకాశాలను పెంపొందించుకునే అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నైపుణ్యతతో అన్ని రంగాల్లో యువత రాణించొచ్చన్నారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటూ వ్యాపార రంగాల్లో స్థిరపడి నలుగురికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా యువత వైవీబీకి ఆయన చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో జంపన వీర శ్రీనివాస్, అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, వెన్నెల ప్రసాద్, కఠారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



వైవీబీకి చిత్రపటాన్ని బహూకరిస్తున్న యువత

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందా వేణు అన్నారు. స్థానిక అంబేడ్కర్ పార్కులోని కమ్యూనిటీ హాలులో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో వెలుగులు నింపిందన్నారు. ఆయా వర్గాల విద్య, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగు పడతాయని చెప్పారు. వర్గీకరణ విషయంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారం అందించారని తెలిపారు. ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు మాట్లాడుతూ.. వర్గీకరణకు అనుకూలంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో మాదిగ, మాదిగ ఉపకులాల 30 ఏళ్ల కల నెరవేరిందన్నారు. వివిధ సంఘాలకు చెందిన కమ్మంద్రు యువరాజు, ధనియాల నాగరాజు, దేవరపల్లి ఏసుబాబు, ఎర్రగుంట వినోద్, దొండపాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నేతలు

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం

ఉయ్యూరు: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. స్నేహితులు ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకొని వేడుకలు చేసుకున్నారు. ఉయ్యూరుకు చెందిన కొందరు స్నేహితులు అరకు వెళ్లి మరీ ప్రత్యేకంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.



వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: కాళ్లు, చేతులు పూర్తిగా చచ్చుపడిన పేద మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిల్చింది. స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కలిశెట్టి మహాలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమె రెండు చేతులు, కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. దీంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహాలక్ష్మి కుటుంబానికి స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ తనవంతు సాయాన్ని అందించారు. వైద్యుల సూచనల మేరకు 90 రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించాల్సి రావడంతో దానికి అయ్యే ఖర్చును పూర్తిగా స్రవంతి ట్రస్ట్ అందిస్తుందని సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆమెను పరామర్శించి మొదటి నెల వైద్య ఖర్చులు, ఫిజియోథెరపీ చికిత్సకు అయ్యే మొత్తాన్ని అందించారు. ట్రస్ట్ సభ్యులు యార్లగడ్డ సత్యనారాయణ, జాస్తి భూపతి, వడ్లమూడి ఆంజనేయులు పాల్గొన్నారు.

అధ్వానంగా ముస్తాబాద రహదారి

గన్నవరం రూరల్: మండలంలోని మెట్ట గ్రామాల్లో మేజర్ పంచాయతీ ముస్తాబాద. ఈ గ్రామంలో హైస్కూల్ క్రాస్ రోడ్స్ నుంచి సావరగూడెం రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వాన దుస్థితిలో ఉంది. అడుగడుగునా గోతులతో వాహనదారులు రోజూ ఇక్కట్లు పడుతున్నారు. వర్షం వస్తే ఈ గోతుల్లో నీరు నిలిచి వాహనాలు నడిచేందుకు వీలు లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సావరగూడెం, ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు. రోజూ వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు ప్రయాణించే ఈ రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రాథమికంగా రోడ్డుపై ఏర్పడ్డ గోతులు పూడ్చించాలని కోరుతున్నారు.

